నీకు తెలుసా జగన్? మీ అన్నయ్య నువ్వంటే మండి పడుతున్నాడు. వాడికి కనిపించకు. తెలుసా? అర్థమయిందా?? అనేసి తాతయ్య అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

తను మంచంమీద కూర్చుని చాలా సేపు ఏడ్చాడు. ఎంతసేపు ఏడ్చాడో....!

చెరువులో తేలుతున్న సుకుమారి శవం మళ్ళీ కళ్ళముందు కదిలింది. ఈసారి మాత్రం అతనికి విచారం కలగలేదు. కొంచెం సంతోషం కలిగిందనే చెప్పాలి.

ఆ రోజున్నుంచీ విశ్వంకి దూర దూరంగా ఉంటున్నాడు తను. కనిపిస్తే చాలు చంపేస్తానన్నాడు మరి!

అదిగో.... ఆ రోజునుంచీ ఈనాటి వరకూ అతను చెరువు వేపు వెళ్ళలేదు. ఇప్పుడు కూడా అతనికి వెళ్లాలని లేదు కాని........

ఆ కొత్తమ్మాయిని చూస్తోంటే వెళ్ళాలని పిస్తోంది. ఈ అబ్బాయీ, అమ్మాయీ అక్కడ ఏం చేస్తారో. చూడాలి. చూసి తీరాలి. చెరువంటే చచ్చేంత భయమయినా వాళ్ళ వెంట వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. వాళ్ళ వెనకే పొదల్లోంచి నక్కుతూ, పాకుతూ అనుసరించడం ప్రారంభించాడు.

చెరువు దగ్గర పడింది. అతను పొదల మాటున కూర్చుని కొమ్మల్నీ తప్పించి వాళ్ళ వేపు చూశాడు. ఒక రకమయిన ఉద్రేకంతో అతని శరీరం వేడెక్కింది. ఊపిరి బిగపట్టి, సుకుమారిని మనసులోంచి చెరిపేసి అటు చూశాడు అతను.

❊ ❊ ❊

మురళీ, కిరణ్మయీ చెరువుని సమీపించాడు. చెరువులోని నీరు స్వచ్ఛంగా నిర్మలంగా ఉంది. ఎన్నో సంవత్సరాలుగా మనిషన్న వాడెవడూ ఈ చెరువు దరిదాపులకి రానట్టుంది.

చెట్టు చుట్టూ ఎత్తయిన చెట్లు ఉన్నాయి. దట్టమయిన పొదలున్నాయి. గాలికి చెట్లు కొమ్మలూ ఊగుతున్నాయి. ఎక్కడన్నుంచో ఏవో పక్షుల అరుపులు.

"చిన్న చెరువుఅనుకున్నాను కానీచాలా పెద్ద చెరువే సుమా!" అంది కిరణ్మయి.

"మరేం అనుకున్నావ్. ఇక్కడికి నేను చాలాసార్లు వచ్చాను. అందుకే నాకు బాగా తెలుసు" అన్నాడు మురళి.

అంతలో అతనికి చరచరపాకుతూ వెళ్తోన్న పాము ఒకటి కన్పించింది. కాని ఆ విషయం కిరణ్మయికి చెప్పలేదు.

చెరువు ఒడ్డున ఉన్న ఒక బండరాయి మీదకూర్చుని కాలిపాదాలని చెరువు నీటిలో ఉంచాడు మురళి, కాళ్ళు అటూ, ఇటూ ఆడిస్తూ "కానీ, నీ జలకాలాట.... ఇంకా ఆలస్యం ఎందుకు?" అన్నాడు.

❊ ❊ ❊

అతను పొదల మాటున మఠం వేసుకు కూర్చున్నాడు. కొమ్మల్ని ఒత్తిగించి, వాళ్ళకేసే తదేకంగా చూడసాగాడు.

ఆ అబ్బాయి లేకుండా ఆ అమ్మాయి ఒక్కర్తీ ఉంటే ఎంత బాగుణ్ణు.... అప్పుడు మరోసారి.... ఎన్నోసారో లెక్కలేదు.... అనుకున్నాడు.

అబ్బాయివంక క్రూరంగా చూశాడు. ఆ చూపులకే శక్తి ఉంటే?!

నిశ్శబ్దంగా ఉండాలి....చప్పుడు చెయ్యకూడదు....వాళ్ళేం చేస్తారో ప్రతి కదలికనీ జాగ్రత్తగా గమనించాలి....అనుకున్నాడు అతను.

(సశేషం)

---

## అనుమానం.

పెళ్ళి చూపులు జరుగుతున్నాయి.

అమ్మాయి వైపు వాళ్ళు అబ్బాయి తల్లి అడిగిన ప్రశ్నలకు జాగ్రత్తగా. వినయంగా జవాబులు ఇస్తున్నారు. మధ్య మధ్యలో అబ్బాయి తన కాబోయే భార్యను తనివి తీరా చూసుకుంటున్నాడు.

ఆఖరి ప్రశ్న పెళ్ళికొడుకు మోహన్ అడిగాడు.

"మీకు పుస్తకాలు చదివే అలవాటుందా?"

వెంటనే అమ్మాయి తండ్రి అందుకొని చెప్పారు.

"మా అమ్మాయి తెలుగు సాహిత్యం అంటే చెవి కోసుకుంటుంది.

పాత వాళ్ళల్లో నన్నయ్య, తిక్కన్న, శ్రీనాధుడు, ఇప్పటి వాళ్ళల్లో చందుసోంబాబు మల్లాదివెంకటకృష్ణమూర్తి, మైనంపాటి భాస్కర్ అంటే అమ్మాయికి చాల యిష్టం"

"అలాగా!" అని ఆ పెళ్ళికొడుకు జీవం లేని నవ్వు నవ్వాడు. పెళ్ళిచూపులు ముగిశాయి.

వారం తర్వాత పెళ్ళికొడుకు ఉత్తరం రాశాడు. అందులో ఇలా ఉంది.

"పరపురుషుల మీద అంత యిష్టం కలిగిన మీ అమ్మాయిని పెళ్ళి చేసుకోవడం భావ్యం కాదని మా అమ్మగారు అంటున్నారు ఆమె అభిప్రాయంతో నేనూ ఏకీభవిస్తున్నాను.

అమ్మాయి వైపు వాళ్ళు నిశ్చేష్టులయ్యారు.

–కొత్తపల్లికిరణ్ కుమార్

## ఫ్రెష్

ట్రెయిన్ ఎక్కి ఓసారి మొత్తం కంపార్టుమెంటంతా చూశాను. విండో సీట్లన్నీ నిండిపోయి ఉన్నాయి. ఇద్దరమ్మాయిలు కూర్చున్న పెద్దసీటులో ఒక్కరికి సరిపోయే ఖాళీ ఉంది. నేను వెళ్ళి వాళ్ళ పక్కనే కూర్చుని వాళ్ళకేసి చూశాను. ఇద్దరి వయసుల్లో ఓ అయిదేళ్ళ తేడా ఉంటుందేమో. గొప్పింటి బిడ్డల్లానే ఉన్నారు. కానీ ముఖాల్లో భయం తాండవిస్తుంది. ఇంట్లోంచి పారిపోయివచ్చిన బాపతేననిపించింది.

ఇక నా గురించి చెప్పవలసినవస్తే ముందు నాకున్న సెక్స్పిచ్చి గురించే చెప్పాలి. ఇటువంటి 'పాళ్ళు – భక్త సాంప్రదాయ కుటుంబంవాళ్ళు–అంటే నా భాషలో "ఫ్రెష్"న్న మాట. కనిపిస్తే నేనసలు వదిలి పెట్టను.

ట్రెయిన్ తరువాత స్టేషన్‌లో ఆగే లోపల అన్ని రకాల వలలూ ఆమెచుట్టూ వేశాను. ఈ స్టేషన్‌లో ట్రైన్ అరగంటాగుతుంది. దిగి,ఆ అమ్మాయిని కూడా పిలిచాను. ఖాళీ వెయిటింగ్ రూమ్‌లోకి వెళ్ళాం ఇద్దరం. పావుగంటకి నా పనయిపోయింది. కానీ చిన్నమ్మాయి మీద మనసులేకపోలేదు.

తొందర పడుతున్నానని తెలిసినా కోరిక నాపుకోలేక ఆమెకాసంగతి సూచనప్రాయంగా చెప్పాను. ఉత్తరక్షణంలో చెప్పుచ్చుకొట్టడుతుందేమోనని అనుకున్నాను కానీ ఆశ్చర్యం! ఆ అమ్మాయిలేచి వెళ్ళిపోయింది. కాసేపటికి తన చెల్లాయితోపాటూ రూమ్‌లోకి వస్తూఅంది "ఇది నాకు తోడుగుండేదే బాబూ- బేగీవచ్చేయండి బేరం సంగతి బండిలో మాట్లాడుకుందాం" అని వెళ్ళిపోయింది. గనేరియా గుర్తొచ్చిందో సిఫిలిస్‌గుర్తొచ్చిందో గానీ నాఅంచనా తప్పినందుకో అలాగే స్థాణువులా ఉండిపోయాను.

– పి.వి.కెన్నెడీ